సందడే సందడి

ఘనంగా అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం

- ఓపెన్‌టాప్ జీప్‌లో అంబర్‌పేట ఫైవంతెనపై ప్రయాణించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- ఫ్లైఓవర్ సర్వీస్‌రోడ్డు సమస్యను గడ్కరి దృష్టికి తీసుకొచ్చిన ఎమ్మెల్యే కాలేరు
- సభా ప్రసంగంలో సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచన
- చొరవ తీసుకుని పరిష్కరిస్తానని తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి


కేంద్రమంత్రి నితిన్ గడ్కరికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



సభావేదికపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరిని సన్మానిస్తున్న కార్పొరేటర్ ఉమా రమేష్‌యాదవ్

అంబర్‌పేట: ఏడేళ్లుగా నిర్మాణం సాగిన అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ఆదివారం అధికారికంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.మొదట గోల్నాక చర్చి వద్ద కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ చేరుకున్నారు. కేంద్ర రోడ్డు రవాణ శాఖ మంత్రి చేతుల మీదుగా ఫ్లైఓవర్ అట్టహాసంగా ప్రారంభమైంది.

◆ ఓపెన్ టాప్ జీప్‌లో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరి, జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఫ్లైఓవర్‌పై ప్రయాణించారు.

◆ ఫ్లైఓవర్ ముగింపు ఇరానీ కేఫ్ వద్ద దిగి అక్కడి నుంచి యూ టర్న్ తీసుకుని ఓపెన్ టాప్ జీప్‌లోనే మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకున్నారు.

◆ స్థానిక కార్పొరేటర్లు, బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.

◆ ప్రధానంగా ఫ్లైఓవర్ సర్వీసు రోడ్డు సమస్యపై స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి వినతి పత్రం అందజేశారు. దీనికి ఆయన ఉపన్యాసంలో రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.

◆ వేదికపై ఉన్న రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవ తీసుకుని సర్వీసు రోడ్డు సమస్యను ప్రత్యేక దృష్టిసారించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

◆ సభకు స్థానిక బీజేపీ నేతలతో పాటు సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలోని బీజేపీ శ్రేణులు ఆర్టీసీ బస్సుల్లో వచ్చారు.

◆ సభా వేదికపై ఎంపీలు, గ్రేటర్ మేయర్, కార్పొరేటర్లతో పాటు సీనియర్ బీజేపీ నేతలు ఉన్నారు.



సభా వేదికపై నుంచి అంబర్‌పేట ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి


అంబర్‌పేట ఫ్లైఓవర్‌పై ప్రయాణిస్తున్న కేంద్రమంత్రులు నితిన్ గడ్కరి, కిషన్‌రెడ్డి, రాష్ట్రమంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్


కేంద్ర, రాష్ట్ర మంత్రులకు నినాదాలు చేస్తూ స్వాగతం పలుకుతున్న బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని ముషీరాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు అరవింద్ కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం రాంనగర్ చౌరస్తాలో మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పన యాదవ్ ఆధ్వర్యంలో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వారు 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్‌గౌడ్, మోదేష్, జుబేర్ హుస్సేన్, పాశం అనిల్, లోకేష్‌యాదవ్, అంజియాదవ్, అనిల్ యాదవ్, మేడి సురేష్, వెంకటేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం రూ.2,36,074


కానుకలు లెక్కిస్తున్న అర్చకులు, భక్తులు

చిక్కడపల్లి: వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. ఆలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ సుధాకర్, ఈవో మాటర్ల దేవనాథం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో లెక్కించారు. ఏప్రిల్ నెల మొత్తానికి రూ.2,19,540 ఆదాయం వచ్చిందన్నారు. ఆన్‌లైన్ (ఈ–హుండీ) ఆదాయం రూ.16,534 వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, కందాళ వెంకటాద్రి, సభ్యుడు మురికిగణేష్, భక్తులు పాల్గొన్నారు.

తిరిగి సొంతగూటికి.!


ఎమ్మెల్యే ముఠాగోపాల్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన సురేందర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ నాయకుడు సురేందర్ బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, యువజన నాయకుడు ముఠా జైసింహ సోమవారం సురేందర్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల అడిక్‌మెట్ డివిజన్ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శిగా సురేందర్ రాజీనామా చేసి బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. బీజేపీ విధానాలు నచ్చక తిరిగి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కొందరి ఒత్తిడి వల్ల బీజేపీలో చేరానని సురేందర్ తెలిపారు. బీఆర్‌ఎస్ తనకు పుట్టినిల్లు లాంటిదని భవిష్యత్‌లో ఏ పార్టీలో చేరబోనని ఆయన స్పష్టం చేశారు.

సుందరయ్య పార్కు అభివృద్ధికి కృషి చేస్తా



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. సోమవారం వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్‌ను కలిసి పార్కు సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... త్వరలో సుందరయ్య పార్కును సందర్శించి పార్కు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

బయట చెత్త వేస్తే జరిమానే!

స్వచ్ఛ ఆటోలకు ఇవ్వకుండా బయటవేస్తున్న వారిపై నిఘా

- మహిళా సమాఖ్యలకు బాధ్యతల అప్పగింత
- పైలట్ ప్రాజెక్టు కింద 4 బస్తీల ఎంపిక
- ఇంటింటికీ తిరుగుతూ ఆర్పీల అవగాహన
- వివరాల సేకరణ కూడా..


ఇందిరానగర్‌లో అవగాహన కల్పించి వివరాలు సేకరిస్తున్న రిసోర్స్ పర్సన్లు

బంజారాహిల్స్: రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో ఇష్టారాజ్యంగా చెత్త వేసేవారిపై చర్యలు తీసుకునేందుకు జీహెచ్‌ఎంసీ సన్నద్ధమయ్యింది. ఈ మేరకు ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోల్లో కాకుండా బయట చెత్త వేసేవారిని గుర్తించి వారికి జరిమానాలు విధించే బాధ్యతను మహిళా పొదుపు సంఘాలు రిసోర్స్ పర్సన్ల (ఆర్పీలు)కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. పైలట్ ప్రాజెక్ట్ కింద జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో 4 బస్తీలను ఎంపిక చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–10 లోని ఉదయ్‌నగర్, సింగాడబస్తీ, రోడ్డు నంబర్–12లోని ఎన్‌బీటీనగర్, రోడ్డునంబర్–2లోని ఇందిరానగర్ బస్తీల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. ఇప్పటికే ప్రాజెక్ట్ పనులు ప్రారంభించిన అధికారులు వచ్చే వారం నుంచే జరిమానాలు విధించనున్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా స్వచ్ఛ ఆటోలకే తప్పనిసరిగా ఇవ్వాలని ఆర్పీలు ఇప్పటికే ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నారు. ఎంతమంది చెత్తను ఆటో టిప్పర్‌లో వేస్తున్నారు..? ఎవరూ రోడ్లపై వేస్తున్నారు..? అనే వివరాలను సేకరిస్తున్నారు. అలాగే సరిపడా స్వచ్ఛ ఆటోలు ఉన్నాయో..? లేవో..? కూడా ఈ సర్వేలో తేలుస్తున్నారు. చెత్తను ఆటో టిప్పర్‌లో వేయకుంటే రూ.500 నుంచి రూ.2,000 ల వరకు ఫైన్ విధిస్తారు. జరిమానా డబ్బులను పొదుపు సంఘాల ఖాతాల్లో జమ చేస్తారు. ఈ నగదును సదరు పొదుపు సంఘాల వారు పర్యావరణ పరిరక్షణ కోసం వినియోగించాలని అధికారులు ఆదేశించారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న వరప్రసాద్

పంజగుట్ట: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ దళిత జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాద్ తెలిపారు. సోమాజీగూడలోని దిల్‌కుశ గెస్ట్‌హౌస్‌లో కార్యక్రమ కరపత్రాన్ని క్రిస్టియన్ సంఘాల నాయకుడు జారుషలెం మత్తయ్యతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1956లో సిక్కు మతం తీసుకున్న దళితులకు, అలాగే 1990లో బౌద్ధమతం తీసుకున్న దళితులకు ఎస్సీ హోదా కల్పించారని అదేతరహాలో దళిత క్రైస్తవులకు కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాలకు చెందిన నాయకులు బగడం శ్రీనివాసరావు, ఆనంద కిరణ్ కుమార్, నరసింగరావు, పాస్టర్ ఎవరెస్ డేవిడ్ పాల్, పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక


అంబర్‌పేట ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

అంబర్‌పేట: అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కిరణ్‌కుమార్ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. బీఆర్‌ఎస్ నేతలు ఎర్రబోలు నర్సింహారెడ్డి, గడ్డం రవికుమార్ తదితరులు సోమవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఇన్‌స్పెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈనెల 11న 'రన్'

పంజగుట్ట: వృక్షధామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న మదర్స్ డే పురస్కరించుకుని గచ్చిబౌలి స్టేడియంలో 5కే, 3కే, 2కే రన్స్ నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కల్యాణి బెల్లంకొండ తెలిపారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమెరికాలో ఫౌండేషన్ స్థాపించి 4 దేశాల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వృక్ష సంపదను కాపాడేందుకు, ప్రజల్లో పర్యావరణం, వృక్ష సంపద వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పిస్తూ ఏటా కనీసం లక్ష మొక్కలు నాటాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు.

తెలంగాణ బాలోత్సవం సమ్మర్ క్యాంప్ షురూ..


బాలోత్సవ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులతో భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న సమ్మర్ క్యాంప్‌ను బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చిన్నారుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రతి ఏడాది సుమారు 20 రోజుల పాటు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజ్ఞానం, వినోదంతోపాటు విలువలతో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివిధ రకాల ఆటలు, పాటలు, నృత్య, డ్రాయింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల పిల్లలో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కార్యదర్శి ఎస్. సోమయ్య , రూప రుక్మిణి, దివ్య, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

విశ్వమాత నృత్య నాటిక



పార్వతిదేవిగా వాసవీచౌదరి అభినయం

నల్లకుంట: నృత్య కిన్నెర అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం రవీంద్రభారతిలో విశ్వమాత పార్వతిదేవి నృత్య నాటిక ప్రదర్శించారు. నృత్య కిన్నెర అకాడమీ వ్యవస్థాపకురాలు, ప్రముఖ కూచిపూడి నృత్య గురువు మద్దాల ఉషా గాయిత్రి శిష్యురాలైన ప్రముఖ కూచిపూడి నృత్య కారిణి వాసవీ చౌదరి 'విశ్వమాత పార్వతిదేవి'గా తన అభినయంతో ప్రేక్షకులను రంజింపజేశారు. వినాయకుడు, కుమారస్వామి పాత్రకు అశిక సుందరి, జ్యోతి, మానస జీవం పోశారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు

అంబర్‌పేట: ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. సోమవారం అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో 47మందికి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటికీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలే పేదలకు అందుతున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమవుతోందని విమర్శించారు. పేదలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, బీ.పద్మా వెంకట్‌రెడ్డి, అమృత, తహసీల్దార్ వీరబాయి, సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయం


లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్న పొన్నాడ సుబ్రహ్మణ్యప్రసాద్

నల్లకుంట: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం చరిత్రాత్మక నిర్ణయమని టీపీసీసీ సేవాదళ్ మాజీ చీఫ్ ఆర్గనైజర్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ అన్నారు. సోమవారం నల్లకుంటలోని పలు రేషన్‌దుకాణాలను డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌తో కలిసి ఆయన సందర్శించారు. సన్నబియ్యం పంపిణీని ప్రక్రియను పరిశీలించారు. సన్నబయ్యం ఎలా ఉన్నాయని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, సీహెచ్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య సంకీర్తనల గాన మహాయజ్ఞం


అన్నమయ్య సంకీర్తనలను గానం చేస్తున్న గురు వెంకటేశ్వర్లు, కోటపాటి గోవిందదాస

చిక్కడపల్లి: దక్షణ భారత తొలి వాగ్గేయకారులు అన్నమాచార్య వేలాది కీర్తనలలో 108 సంకీర్తనలు గ్రహించి ఆయన 617 జయంతిని పురస్కరించుకొని అన్నమయ్య సంక్తీరనల గాన మహాయజ్ఞం సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యింది. గురు వెంకటేశ్వర్లు, కోటపాటి గోవిందదాస స్వర రచనతో శ్రీత్యాగరాయ గానసభలోని మారుతి కళా వేదికపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఏఎస్ ఎస్‌వీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహణలో అనురాధ కోటపాటి పర్యవేక్షణలో తొలిరోజు జరిగిన గానగోష్టిలో గానం చేశారు. గోవింద దాస కడప రాయ సంకీర్తనలు మధురంగా గానం చేసి శ్రోతలను ఆకట్టుకున్నారు.

ఎంపీ నిధులన్నీ ముషీరాబాద్ అభివృద్ధికే..


ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ మసూద్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన ఎంపీ నిధులలో అత్యధికంగా ముషీరాబాద్ నియోజకవర్గానికే కేటాయిస్తానని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని సిద్దిఖ్‌నగర్, సంధాని వీధిలో దశాబ్దకాలంగా నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఎంపీ నిధుల నుంచి రూ.10.50 లక్షలు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ సయ్యద్ మసూద్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు జఫీర్ ఉద్దీన్, నాయకులు ఉస్మాన్, అబ్దుల్ కరీం, వాహెద్, ముజీద్, ఖైరత్ అలీబాబా పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వంతోనే దేశాభివృద్ధి సాధ్యం

సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్

చిక్కడపల్లి: బీజేపీ ప్రభుత్వంతోనే దేశాభివృద్ధి సాధ్యమని సికింద్రాబాద్ పార్లమెంట్ పార్టీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ అన్నారు. అంబర్‌పేటలో ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవానికి, బహిరంగ సభకు గాంధీనగర్ నుంచి బీజేపీ నేతలు, కార్యకర్తలు సోమవారం సాయంత్రం భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర అభివృద్ధికి రూ.2200కోట్ల నిధులను కేటాయించారన్నారు. దేశ రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, అరుణ్‌కుమార్, దామోదర్, సురేష్‌కాజు, సాయికుమార్, ఆనంద్‌రావు, యాదగిరి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గడ్కరి సభకు తరలిన బీజేపీ నేతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరి బహిరంగ సభకు రాంనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు బస్సులో తరలివెళ్లారు. అంతకు ముందు బాగ్‌లింగంపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించారు.కార్పొరేటర్ కె.రవిచారి, సీనియర్ నాయకులు సి. పార్థసారథి, జైపాల్ రెడ్డి, గడ్డం సతీష్, పూసాల రాజు, నవీన్, కేశవ్ తదితరులు పాల్గొన్నారు.


ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవ బహిరంగ సభకు తరలి వెళ్తునన బీజేపీ నేతలు


నితిన్ గడ్కరి బహిరంగ సభకు తరలివెళ్తున్న రాంనగర్ బీజేపీ నాయకులు